క్లుప్తంగా

వైద్య పరీక్షలు



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ జెస్సీ సుప్రియ

కడియం: మాధవరాయుడుపాలెం–1 పరిధిలోని పంచాయతీ కార్యాలయం, కడియంపు లంక –2 పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం వైద్య శిబిరాలు నిర్వహించారు. వీటిలో 80 మందికి వివిధ రకాల వైద్యపరీక్షలు చేశారు. అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. డాక్టర్లు నాగసాయి మౌర్య, ఎస్.జెస్సీ సుప్రియ, ఆరోగ్యశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

వరద బాధితులకు విరాళం

కడియం: విజయవాడ వరద బాధితులకు దుళ్ల గ్రామానికి చెందిన జనసేన, టీడీపీ నాయకులు రూ.1,19,929 విరాళంగా అందజేశారు. ఈ మొత్తాన్ని ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరికి శనివారం అందించారు.

బీజేపీ సదస్యత అభియాన్



స్టాల్‌ను ప్రారంభిస్తున్న మంత్రి సత్యకుమార్

రాజమహేంద్రవరం సిటీ: బీజేపీ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన బీజేపీ సదస్యత అభియాన్ 2024 (సభ్యత్వ నమోదు కార్యక్రమం)ను జయప్రదం చేయాలని రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ పిలుపు నిచ్చారు. నగరంలో పార్టీ జిల్లా కార్యాలయంలో యువమోర్చా జిల్లా అధ్యక్షుడు కందికొండ రమేష్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సభ్యత నమోదు స్టాల్‌ను అనపర్తి ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డితో కలిసి ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు బొమ్ముల దత్తు, రేలంగి శ్రీదేవి, అడబాల రామకృష్ణ పాల్గొన్నారు.

వైభవంగా గణపతి హోమం



రథం వీధి మండపంలో జరుగుతున్న గణపతి హోమం

ధవళేశ్వరం: గణపతి నవరాత్ర ఉత్సవాల సందర్భంగా ధవళేశ్వరంలోని రథంవీధి గాంధీబొమ్మ సెంటర్‌లో యడ్ల వెంకటేష్, రథం వీధి రాయల్స్ ఏర్పాటు చేసిన గణపతి మండపం వద్ద శనివారం ఉదయం గణపతి హోమం వైభవంగా నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు తరలి వచ్చి గణపతి హోమంలో పాల్గొని గణనాథునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మధ్యాహ్నం భారీ అన్నసమారాధన జరిగింది. సుమారు ఐదువేల మంది భక్తులు స్వామివారి ప్రసాదం స్వీకరించారు. స్థానిక పెద్దలు, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

రాజమహేంద్రవరం సిటీ: మరమ్మతుల నేపథ్యంలో ఆదివారం నగరంలో పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీఈపీడీసీఎల్ ఈఈ నక్కపల్లి శామ్యూల్ అన్నారు. ఉదయం 7.30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకూ కోటిలింగాలపేట, సీతంపేట, ఈఎస్ఐ హాస్పిటల్ ఏరియా, ఎన్టీఆర్ కాలనీ, పేపర్ మిల్లు ఏరియా, టీచర్స్ కాలనీ, జమీందారుమెట్ట తదితర ప్రాంతాలలో సరఫరా ఉండదన్నారు.

ట్రక్ ఆటోలోంచి జారిపడి బాలిక మృతి

సీతానగరం: ట్రక్ ఆటోలోంచి కింద పడి జాలిమూడికి చెందిన ఉర్ల లక్ష్మి రూపాకుమారి (12) మృతి చెందింది. ఎస్సై డి.రామ్‌కుమార్ శనివారం తెలిపిన వివరాల ప్రకారం.. జాలిమూడికి చెందిన లక్ష్మి రూపాకుమారి కాటవరం స్కూల్లో 8వ తరగతి చదువుతోంది. శుక్రవారం సాయంత్రం 4 గంటలకు పాఠశాల ముగిసిన తర్వాత కాటవరంలో ట్రక్ ఆటో వస్తుండగా లిఫ్ట్ అడిగి ఎక్కింది. అయితే కాటవరం రైస్ మిల్లు టర్నింగ్ వద్ద అదుపు తప్పి ట్రక్ నుంచి కింద పడింది. ఈ ఘటనలో బాలిక తలకు తీవ్ర గాయం కావడంతో అదే ట్రక్ ఆటోలో రాజమహేంద్రవరంలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. బాలిక చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి 7 గంటలకు మృతి చెందింది. తండ్రి ఉర్ల వెంకట్రావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. బాలిక మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

18, 19 తేదీల్లో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ క్రీడా ఎంపికలు

పెదపూడి: జి.మామిడాడ గ్రామంలోని డీఆర్‌కే రెడ్డి కాలేజీలో ఈ నెల 18, 19 తేదీల్లో మండల స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ క్రీడా ఎంపికలు నిర్వహించనున్నారని ఎంఈఓ–2 సీవీవీ సత్యనారాయణ, ఫిజికల్ డైరెక్టర్ బి.వెంకటగిరి తాతరాజు తెలిపారు. వాలీబాల్, కబడ్డీ, కోకో, బ్యాడ్మింటన్, చెస్, యోగ, త్రోబాల్ తదితర క్రీడల్లో 18న బాలురు, 19న బాలికలకు ఎంపికలు నిర్వహిస్తారన్నారు.

నిమజ్జనోత్సవానికి సర్వం సిద్ధం

- రామపాదాల రేవు వద్ద రోప్, పంటు ఏర్పాటు
- జాగ్రత్తలు పాటించాలని సూచిస్తున్న పోలీసులు



ధవళేశ్వరంలోని రామపాదాల రేవు

ధవళేశ్వరం: గణేష్ నిమజ్జనోత్సవానికి ధవళేశ్వరం రామపాదాలరేవు వద్ద ఏర్పాట్లు పూర్తి అయ్యాయి. రేవు వద్ద రోప్, పంటు ఏర్పాటు చేశారు. గజ ఈతగాళ్లను కూడా నియమించనున్నారు. నిమజ్జనోత్సవం సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ధవళేశ్వరం పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేయనున్నారు. వినాయక చవితి అనంతరం తొమ్మిదవ రోజు నుంచి పదమూడో రోజు వరకు విగ్రహాలను అధిక సంఖ్యలో నిమజ్జనం చేస్తుంటారు. ధవళేశ్వరంతో పాటు పరిసర గ్రామాల నుంచి సుమారు 300 విగ్రహాలను రామపాదాలరేవులో నిమజ్జనం చేసే అవకాశం ఉంది. ప్రస్తుతం గోదావరి ఉధృతి అధికంగా ఉండటంతో ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. రేవులోకి అందరూ వెళ్లకుండా బారికేడ్లు ఏర్పాటు చేశారు. నిమజ్జనోత్సవం సందర్భంగా తీసుకోవాల్సిన నిబంధనలను ఇప్పటికే పోలీసులు ఉత్సవ కమిటీ సభ్యులకు వివరించారు.

గోదావరి ఉధృతితో అప్రమత్తం

గోదావరి ఉధృతి ఎక్కువగా ఉండడంతో పంచాయతీ, పోలీస్ అధికారులు అప్రమత్తమయ్యారు. నిమజ్జనోత్సవం సందర్భంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై చర్చించారు. ప్రస్తుతం గోదావరి ఉధృతి అధికంగా ఉండటంతో రామపాదాలరేవు వద్ద నీరు వేగంగా వెళుతోంది. కాటన్ బ్యారేజీ నుంచి 7.81 లక్షల క్యూసెక్కుల మిగులు జలాలను విడుదల చేస్తున్నారు. బ్యారేజీకు సమీపంలోనే రామపాదాలరేవు ఉండటంతో ప్రత్యేక చర్యలు చేపడుతున్నారు. రేవులో రోప్ ఏర్పాటు చేశారు. దీనిని దాటి ముందుకు వెళ్లవద్దని ఆదేశాలు జారీ చేశారు. విగ్రహాలను నిమజ్జనం చేసేందుకు పంట్లు ఏర్పాటు చేస్తున్నారు. నిమజ్జనం చేయడానికి లోతుకు వెళ్లవద్దని, రోప్ దాటి ముందుకు వెళితే చర్యలు తీసుకుంటామని హెచ్చరిస్తున్నారు.

నిబంధనలు పాటించాలి



నిమజ్జనోత్సవం సందర్భంగా ఉత్సవ కమిటీ సభ్యులు నిబంధనలు పాటించాలి. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేస్తున్నాం. రామపాదాలరేవు వద్ద రోప్ దాటి లోపలకు వెళితే చర్యలు తీసుకుంటాం. ఆదివారం సుమారు 30 విగ్రహాలను రామపాదాలరేవులో నిమజ్జనం చేసే అవకాశం ఉంది.

– టి.గణేష్, ధవళేశ్వరం సీఐ

రాజమహేంద్రవరంలో సందడి ప్రారంభం



రాజమహేంద్రవరంలో విగ్రహాలను నిమజ్జనం చేసేందుకు పంటుపైకి చేర్చుతున్న సిబ్బంది

రాజమహేంద్రవరం సిటీ: గణపతి నవరాత్ర ఉత్సవాల సందర్భంగా విగ్రహాల నిమజ్జనోత్సవం శనివారం మొదలైంది. రాజమహేంద్రవరంలోని హెడ్ వాటర్ వర్క్స్ సమీపంలోని ఇసుక రేవు వద్ద నిమజ్జనానికి నగరపాలకసంస్థ అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. రేవులో వినాయక విగ్రహాలను గోదావరిలో నిమజ్జనం చేసేందుకు లాంచీ తో పాటు గోదావరిలో ప్రత్యేక పంటు, విగ్రహాలను తరలించేందుకు భారీ క్రేన్ ఏర్పాటు చేశారు. మూడు షిఫ్టుల్లో సేవలు అందించేందుకు 50 మంది పారిశుధ్య కార్మికులను నియమించారు. పోలీస్, రెవెన్యూ, నగరపాలక సంస్థ అధికారులు సంయుక్తంగా పర్యవేక్షిస్తున్నారు. ఇక్కడ సుమారు 1500 విగ్రహాలు నిమజ్జనం చేస్తారని, దానికి అనుగుణంగా ఏర్పాట్లు చేసినట్టు నగరపాలకసంస్థ శానిటరీ సూపర్ వైజర్ ఐ.శ్రీనివాస్ తెలిపారు. ఆదివారం అధిక మొత్తంలో విగ్రహాలు తరలివచ్చే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు.

పుష్కరాల నాటికి గోదావరిని శుభ్రం చేయాలి



విలేకరులతో మాట్లాడుతున్న విశ్వేశ్వరరెడ్డి

రాజమహేంద్రవరం సిటీ: 2027 పుష్కరాల నాటికి గోదావరి జలాలను స్వచ్ఛంగా తయారు చేసేందుకు నగరపాలకసంస్థ చర్యలు చేపట్టాలని రాజమహేంద్రి గోదావరి పరిరక్షణ సమితి అధ్యక్షుడు డాక్టర్ టీకే విశ్వేశ్వరరెడ్డి అన్నారు. ఈ మేరకు శనివారం పుష్కరఘాట్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ వినాయక నవరాత్ర ఉత్సవాలను పురస్కరించుకుని మట్టి విగ్రహాలకు పూజలు చేయడం ఆహ్వానించదగిన పరిణామమన్నారు. వచ్చే ఏడాది 90 శాతం మంది మట్టి విగ్రహాలనే ఏర్పాటు చేసే విధంగా ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చేందుకు గోదావరి పరిరక్షణ సమితి తరఫున కృషి చేస్తామన్నారు. మట్టి విగ్రహాలను మాత్రమే గోదావరిలో నిమజ్జనం చేయడానికి అనుమతించినప్పుడే ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాల వినియోగం తగ్గుతుందన్నారు. వరద తగ్గుముఖం పట్టిన తర్వాత స్నానఘట్టాలను శుభ్రపరచడంతో పాటు నదిలో పేరుకుపోయిన చెత్త, బురద మట్టిని కూడా శుభ్రపర్చాలని సూచించారు. గోదావరిని శుభ్రపరిచేందుకు స్థానిక మత్స్యకారులు సిద్ధంగా ఉన్నారని, వారికి ఖర్చుల కోసం కొంత కేటాయించేందుకు కార్పొరేషన్ చర్యలు తీసుకోవాలన్నారు. లేనిపక్షంలో తామే శుభ్రపర్చడానికి చర్యలు చేపడతామన్నారు. నగర ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించే క్రమంలో పేపర్‌మిల్లు నుంచి విడుదలయ్యే నీటిని ధవళేశ్వరం బ్యారేజీ దిగువన విడుదల చేసేలా చర్యలు చేపట్టాలని కోరారు. రాష్ట్రాన్ని వరదలు ముంచెత్తినప్పటికీ కేంద్రంలోని మోదీ ప్రభుత్వం పైసా రాల్చకపోవడం దురదృష్టకరమన్నారు. చంద్రబాబు సమర్థవంతమైన ముఖ్యమంత్రి అయితే వరద నష్టం కింద కేంద్రం నుంచి రూ.10 వేల కోట్లు సాధించి తీసుకు రావాలన్నారు. సమావేశంలో భద్రరావు, పట్నాయక్, ఎస్‌వీ రెడ్డి పాల్గొన్నారు.

కమ్మేసిన నిర్లక్ష్యం



తూర్పు రైల్వేస్టేషన్ రోడ్డులోని రైల్వే పాఠశాల నుంచి ఆవ రోడ్డులో వాంబే కాలనీ వరకూ విద్యుత్ స్తంభాలపై బరానీ తుప్పలు దర్శనమిస్తున్నాయి. ఇవి విపరీతంగా పెరిగిపోయిన వీధి దీపాలను సైతం కమ్మేస్తున్నాయి. దీంతో రాత్రి సమయంలో లైట్లు వెలిగినా, వాటి కాంతి బయటకు రావడం లేదు. దారిలో అంధకారం నెలకొంటోంది. ఇప్పటికైనా విద్యుత్‌శాఖ అధికారులు స్పందించి బరానీ తుప్పలు తొలగించాలని వాహన చోదకులు కోరుతున్నారు.



వీధి దీపాలను కమ్మేసిన బరానీ తుప్పలు

– ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్)



విద్యుత్ స్తంభంపైకి పాకిన బరానీ తుప్పలు

జాతీయ రహదారిపై బ్లాక్ స్పాట్ల పరిశీలన



వేమగిరిలో బ్లాక్‌స్పాట్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రశాంతి, ఎస్పీ నరసింహ కిశోర్

కడియం: జాతీయ రహదారిపై జిల్లా పరిధిలో ఉన్న బ్లాక్ స్పాట్‌లను కలెక్టర్ పి.ప్రశాంతి, ఎస్పీ డి.నరసింహ కిశోర్ శనివారం రాత్రి పరిశీలించారు. కడియం మండలం పరిధిలోని పొట్టిలంక, కడియపులంక, బుర్రిలంక, వేమగిరి ప్రాంతాల్లో ప్రమాదాలు జరిగే ప్రదేశాలను పరిశీలించారు. జాతీయ రహదారులపై తరచు ప్రమాదాలు జరుగుతున్న ప్రదేశాలను గుర్తించి, అక్కడ తీసుకోవాల్సిన భద్రతా చర్యలపై స్థానిక అధికారులతో చర్చించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రమాదాలు జరిగే ప్రాంతాల్లో సూచికలను ఏర్పాటు చేసి వాహనదారులను అప్రమత్తం చేయాలన్నారు. రహదారుల మరమ్మతులకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చి, పూర్తి చేయాలని ఆదేశించారు. నిర్దిష్టమైన ప్రాంతాల్లోనే వాహనాలను పార్కింగ్ చేసేలా అవగాహన కల్పించాల్సి ఉందన్నారు. ప్రత్యేక సూచిక బోర్డులను ఏర్పాటు చేయడంతో పాటు పెట్రోలింగ్ వ్యవస్థను మరింత సమర్థవంతంగా నిర్వహించాల్సి ఉందన్నారు. కలెక్టర్ వెంట జాతీయ రహదారి ప్రాజెక్ట్ డైరెక్టర్ సురేంద్ర, ట్రాఫిక్ డీఎస్పీ ఎం.వెంకటేశ్వర్లు, సౌత్ జోన్ డీఎస్పీ భవ్య కిశోర్, ఇతర శాఖల అధికారులు ఉన్నారు.

హిందీ భాష దేశ ఐక్యతకు చిహ్నం

బిక్కవోలు: హిందీ భాష దేశ ఐక్యతకు చిహ్నమని, జాతీయ భాష అంటే దేశం మొత్తం మాట్లాడే భాష అని కొంకుదురు ఉన్నత పాఠశాల హెచ్‌ఎం మల్లిపూడి శ్రీనివాస్ అన్నారు. శనివారం పాఠశాల వద్ద హిందీ భాషా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం శ్రీనివాస్ మాట్లాడుతూ భారత ప్రభుత్వం 1949లో హిందీ భాషను జాతీయ భాషగా ప్రకటించిందన్నారు. విద్య, ఉపాధి అవకాశాల కోసం హిందీ నేర్చుకోమని విద్యార్థులకు సూచించారు. ప్రపంచంలో 150 యూనివర్సిటీల్లో హిందీని బోధిస్తున్నారన్నారు. విద్యార్థులు ప్రతి ఒక్కరూ హిందీ నేర్చుకోవడం వల్ల భవిష్యత్‌లో మనుగడకు మార్గం సుగమం అవుతుందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పడాల ఈశ్వర రెడ్డి, మహమ్మద్ వలీషా, అప్పారావు, సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్రీడల్లో అదరహో..

- సత్తా చాటుతున్న నగర విద్యార్థులు
- వివిధ పోటీల్లో పతకాల కైవసం

ప్రకాశం నగర్: రాజమహేంద్రవరం అనగానే గలగలపారే గోదావరి, విద్యాసంస్థలు, చారిత్రక కట్టడాలు, కవులు, సాహితీవేత్తలు, సంఘ సంస్కర్తలు గుర్తుకువస్తారు. ప్రస్తుతం వీరితో పాటు క్రీడాకారులు కూడా పరిచయం అవుతున్నారు. సాంస్కృతిక రాజధానిగా పేరుగాంచిన రాజమహేంద్రవరం విద్యార్థులు చదువుతో పాటు క్రీడాల్లోనూ రాణిస్తున్నారు. వివిధ రకాల జాతీయ పోటీల్లో ప్రతిభ చూపుతున్నారు. అయితే వీరందరూ ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలకు చెందిన విద్యార్థులు కావడం గమనార్హం. క్రీడలపై ఆసక్తితో తమ ప్రతిభకు పదును పెట్టి రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో విజయం సాధించి, అనేక పతకాలు కైవసం చేసుకుంటున్నారు. అంతర్జాతీయ క్రీడా పోటీల వేదికలపై సత్తా చాటుతూ రాజమహేంద్రవరం ఖ్యాతిని దశదిశలా వ్యాప్తి చేస్తున్నారు. క్రికెట్, ఫుట్‌బాల్, వాలీబాల్‌తో పాటు కరాటే, కిక్ బాక్సింగ్, వెయిట్ లిఫ్టింగ్, ఊషు వంటి ఆత్మరక్షణ క్రీడాల్లోనూ సత్తా చాటుతున్నారు.



వెయిట్ లిఫ్టింగ్‌లో సాధించిన పతకాలతో జూహిత గుణ

వెయిట్ లిఫ్టింగ్‌లో స్వర్ణ పతకం

లాలా చెరువు ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న జూహిత గుణ వెయిట్ లిఫ్టింగ్‌లో బంగారు పతకాలు సాధించింది. అనకాపల్లిలో ఆగస్టు 30 నుంచి సెప్టెంబర్ ఒకటి వరకూ జరిగిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అంతర జిల్లాల వెయిట్ లిఫ్టింగ్ చాంపియన్ షిప్ పోటీల్లో సబ్ జూనియర్, జూనియర్ కేటగిరీలో 71 కేజీల విభాగంలో ప్రథమ స్థానాలు సాధించి బంగారు పతకాలు కైవసం చేసుకుంది. కోచ్ యాళ్ల భాస్కరరావు శిక్షణలో తల్లిదండ్రులు దేవీప్రసాద్, పార్వతీ వరలక్ష్మి ప్రోత్సాహంతో ఈ ఘనత సాధించినట్లు జూహిత గుణ తెలిపింది. ఆమె తల్లి సచివాలయం మహిళా పోలీస్‌గా, తండ్రి ఒక ప్రైవేటు సంస్థలో ఉద్యోగిగా పనిచేస్తున్నారు. భవిష్యత్తులో వరల్డ్ యూత్ వెయిట్ లిఫ్టింగ్ చాంపియన్ షిప్ పోటీల్లో పాల్గొనడమే తన ఆశయమని జూహిత చెప్పింది. ఆమె హిమాచల్‌ప్రదేశ్‌లో అక్టోబర్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొననుంది. ఇంతటి ఘన విజయం సాధించిన జూహితను లాలాచెరువు నగర పాలక సంస్థ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అంకం మల్లేశ్వరరావు, ఉపాధ్యాయులు, పాఠశాల ఎస్ఎంసీ సభ్యులు అభినందించారు.

క్రీడలతో భవిష్యత్తు



చదువుతో పాటు క్రీడల్లో రాణించిన విద్యార్థులకు మంచి భవిష్యత్తు ఉంటుంది. క్రీడల్లో చూపిన ప్రతిభ ఆధారంగా స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగాలు కూడా లభిస్తాయి. విద్యార్థులు చిన్న నాటి నుంచే తమకు నచ్చిన క్రీడలో శిక్షణ పొందాలి. చదువులో పాటు ఆటలకూ ప్రాధాన్యం ఇచ్చినప్పుడు ఆరోగ్యంతో పాటు ఉన్నత శిఖరాలు అధిరోహించే అవకాశం కలుగుతుంది. తల్లిదండ్రులు కూడా తమ పిల్లలను క్రీడల్లో పాల్గొనేలా ప్రోత్సహించాలి.

– డీఎంఎం శేషగిరి, జిల్లా చీఫ్ కోచ్

పోస్టల్ విశ్రాంత ఉద్యోగుల ధర్నా



ధర్నా చేస్తున్న పోస్టల్ విశ్రాంత ఉద్యోగులు

రాజమహేంద్రవరం సిటీ: పోస్టల్ శాఖలో విధులు నిర్వహించి, ఉద్యోగ విరమణ పొందిన పెన్షనర్ల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఆల్ ఇండియా పోస్టల్ అండ్ ఆర్ఎంఎస్ పెన్షనర్స్ అసోసియేషన్ రాజమహేంద్రవరం డివిజన్ అధ్యక్షుడు ఎస్ఈఎస్ సత్యనారాయణ, కార్యదర్శి రామలింగేశ్వరరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు స్థానిక పోస్టల్ ప్రధాన కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. వారు మాట్లాడుతూ విశ్రాంత ఉద్యోగులకు పాత పెన్షన్ విధానం అమలు చేయాలన్నారు. రైళ్లలో సీనియర్ సిటిజన్లకు రాయితీలను పునరుద్ధరించాలని, 8వ వేతన సంఘం సిఫారసులు అమలు చేయాలని, 18 నెలల డీపీ బకాయిలు చెల్లించాలని, పింఛనుదారులకు 65 ఏళ్లు వచ్చిన వెంటనే అదనపు పింఛను ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ధర్మరాజు, చంద్రశేఖరరావు, సూర్యారావు పాల్గొన్నారు.

సిమెంట్ బెంచీల వితరణ



సిమెంట్ బెంచీలు అందజేసిన సభ్యులు

రాజమహేంద్రవరం సిటీ: అవసరార్థులకు సేవలు అందించేందుకు జేసీఐ రాజమండ్రి రాక్ స్టార్స్ ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటుందని అధ్యక్షుడు కందుల భార్గవ్ అన్నారు. ఆ సంస్థ ఆధ్వర్యంలో శనివారం రాజమహేంద్రవరం ప్రభుత్వం ఆసుపత్రిలో ఓపీ రిజిస్ట్రేషన్ విభాగం వద్ద ప్రజలు కూర్చునేందుకు నాలుగు సిమెంట్ బెంచీలు అందించారు. కార్యక్రమంలో హాస్పిటల్ సూపరింటెండెంట్ ఎం.లక్ష్మీసూర్యప్రభ, కో ఆర్డినేటర్ జేసీఐ ఇండియా టి. భరత్ కుమార్, జోన్ డైరెక్టర్ కె.శివ పాల్గొన్నారు.